
బహుమతి పేరిట కుచ్చుటోపీ

చింతామణి, ఏప్రిల్ 30: భారీ బహుమతి వచ్చింది..పన్ను చెల్లిస్తే సొమ్ము విడుదల చేస్తామని రూ.లక్షలకు కుచ్చుటోపీ వేశారు. పట్టణంలోని బెంగళూరు రోడ్డు గుండప్ప లే అవుట్‌కు చెందిన 30ఏళ్ల రాజ్‌కుమార్ బాధితుడు. ఢిల్లీ తిలక్‌నగర్ నుంచి హెర్బల్ లైఫ్ క్వార్టర్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పరిచయం చేసుకున్న వ్యక్తి కంపెనీ నుంచి రూ.19లక్షల బహుమతి వచ్చిందన్నారు. ఇందుకుగాను ఇన్‌కమ్‌ట్యాక్స్, జీఎస్టీ రూ.2.85లక్షలు చెల్లించాలని నమ్మబలికారు. ఏప్రిల్ 14 నుంచి 24వరకు పలు దఫాలుగా రూ.2.85 లక్షలు రాజ్‌కుమార్‌నుంచి వసూలు చేశారు. చివరకు మోసపోయినట్లు గుర్తించిన రాజ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


విద్యార్థి సంఘాల ఆగ్రహం..



కూటమికి.. కుదుపులు



- బీజేపీ, జేడీఎస్‌లను బెంబేలెత్తిస్తున్న ప్రజ్వల్ రాసలీలలు
- రెండో విడత ఎన్నికల్లో ఎదురుదెబ్బ తప్పదా?
- మహిళల నిరసనలు
- బెంగళూరులో బీజేపీ కార్యాలయం ముట్టడి
- కుమారస్వామి బస చేసిన హోటల్ ఎదుట ఆందోళన

బెంగళూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు హాసన్ సిట్టింగ్ ఎంపీ, ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ-జేడీఎస్ పార్టీల ఉమ్మడి అభ్యర్థి ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలలు బీజేపీ, జేడీఎస్ కూటమిని బెంబేలెత్తిస్తున్నాయి. కీలకమైన లోక్‌సభ రెండో విడత ఎన్నికల వేళ ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. దీంతో బీజేపీ, జేడీఎస్ కూటమి నాయకులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రజ్వల్ రేవణ్ణ కుటుంబం బెంగళూరుతోపాటు హాసన్ జిల్లా హొళెనరసీపురలో నివసిస్తోంది. ప్రజ్వల్ హాసన్ ఎంపీ కాగా ఆయన తండ్రి హెచ్‌డీ రేవణ్ణ ఎమ్మెల్యే, మంత్రిగా వ్యవహరించారు. తల్లి భవాని జడ్పీ సభ్యురాలిగా కొనసాగారు. మరో తమ్ముడు సూరజ్ ఎమ్మెల్సీగా ఉన్నాడు. కుటుంబమంతా రాజకీయాల్లో ఉన్నందున హాసన్‌లో అందుబాటులో ఉండేందుకు విలాసవంతమైన నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఎక్కువ కాలం ప్రజ్వల్ హొళెనరసీపురలోనే ఉండేవారు. 2019 లోక్‌సభ ఎన్నికల నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం ఉండేది. తండ్రి రేవణ్ణ మంత్రి కాగా చిన్నాన్న కుమారస్వామి ముఖ్యమంత్రిగా ఉండేవారు. ఇలా ప్రజ్వల్ చుట్టూ బదిలీలు, కాంట్రాక్టులతోపాటు ఇతర అన్ని వ్యవహారాలు తిరిగేవి. కుటుంబీకుల చేతిలోనే ప్రభుత్వం ఉండడంతో ఒక్కశాఖ అనే పరిమితం లేకుండా హాసన్‌తోపాటు పలు జిల్లాలకు సంబంధించిన పైరవీలు సాగేవి. ఇలా కీలక సమయంలోనే ప్రజ్వల్ దారి తప్పినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడినా హాసన్ జిల్లాకు సంబంధించి వీరి హవా కొనసాగేది. ప్రజ్వల్ రేవణ్ణ హొళెనరసీపురలోని ఇంట్లో ఎక్కువగా ఒంటరిగానే ఉండేవారు. ఒకరిద్దరు పని మనిషులు, డ్రైవర్‌లు ఉన్నా వారికి అన్ని విషయాలు తెలిసినవే అనే ఆరోపణలు ఉన్నాయి డ్రైవర్ కార్తీక్ వీరి నుంచి బయటకు వెళ్లగానే ప్రజ్వల్ ఎటువంటి వీడియోలు, ఫొటోలు విడుదల చేయకుండా స్టే తెచ్చుకున్నారు. అంటే ప్రజ్వల్ రాసలీలల అంశం కుటుంబీకులకు ఎప్పుడో తెలిసిందే అనిపిస్తోంది.


ఆప్ ఆధ్వర్యంలో నిరసన

● దేశమంతటా లోకసభ ఎన్నికల వేడి సాగుతున్న తరుణంలోనే జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రాసలీలల అరాచకాలపై ఆ పార్టీ నేతలు వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ సహా పలు పార్టీలు కోరడం లేదు. కానీ ప్రధానమంత్రి స్పందించాలని, హోం మంత్రి జోక్యం చేసుకుని స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ డిమాండ్ చేశారు. ఇక బెంగళూరులో ఉన్న మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అలకలంబ, అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేథ్ బెళగావిలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో తొలి విడత పోలింగ్ ఈనెల 26న జరిగింది. అంతకు రెండు రోజుల ముందే పెన్ డ్రైవ్‌లు హల్‌చల్ చేశాయి. అందరూ పోలింగ్‌లో బిజీగా ఉండడంతో ఆదివారం ఒక్కసారిగా వైరల్ అయ్యాయి.

● రాష్ట్రంలో తొలి విడత పోలింగ్ జరిగేనాటికి ప్రజ్వల్ రాసలీలల సీడీలు వైరల్ కాలేదు. మరో వారం రోజుల్లోనే ఉత్తర కర్ణాటక పరిధిలో 14 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. రెండు రోజులుగా బీజేపీని దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు టార్గెట్ చేస్తున్నాయి. ఈ అంశంతో బీజేపీ వర్గాలు డోలాయమానంలో పడ్డాయి. ఉత్తరకర్ణాటక ప్రాంతం బీజేపీకి అనుకూలమైనది. అటువంటి ప్రాంతంలో పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ బీజేపీ వర్గాలు ధీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధమై పార్టీ జాతీయ అధ్యక్షుడు ద్వారా స్పష్టత ఇప్పించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మేం మాతృమూర్తులకు అండగా ఉంటామని, తప్పు చేసి ఉంటే వెనకేసుకొచ్చే ఆలోచనే లేదని వెల్లడించారు.

● ఇదే విషయమై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి స్పందిస్తూ మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు అయ్యినందునే కేసు సంచలనమైందన్నారు. తప్పు చేసి ఉంటే ప్రజ్వల్‌పై చర్యలు ఉంటాయన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ వెంటనే రంగంలోకి దిగింది. హొళెనరసిపుర పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును సిట్ స్వాధీనం చేసుకుంది. ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించి 32 జీబీ, 8 జీబీల సామర్థ్యం కల్గిన రెండు పెన్‌డ్రైవ్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇందులో దాదాపు 3వేల ఫోటోలు, వీడియోలు నిక్షిప్తమైనట్లు తెలుస్తోంది.

● మరోవైపు పెన్‌డ్రైవ్‌లలో ఉండే మహిళలను కలిసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మరోవైపు రేవణ్ణ, ప్రజ్వల్‌లకు నోటీసులు ఇవ్వనున్నారు. మరోవైపు మహిళా కాంగ్రెస్, ఆప్‌తోపాటు వివిధ ప్రజాసంఘాలు, బెంగళూరు, హుబ్బళ్ళి, శివమొగ్గతోపాటు పలుచోట్ల నిరసనలు చేపట్టారు. హుబ్బళ్ళిలో జేడీఎస్ అత్యవసర కోర్ కమిటీ నిర్వహించేందుకు ఓ హోటల్‌లో పార్టీ నేతలు ఉన్నారనే సమాచారంతో కాంగ్రెస్ కార్యకర్తలు ముట్టడికి యత్నించారు. జేడీఎస్ కార్యకర్తలు పెద్దసంఖ్యలో రావడంతో అక్కడ ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. కోర్ కమిటీలో ప్రజ్వల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఇదే విషయమై ఒక ప్రకటన విడుదల చేశారు.

● బెంగళూరులో బీజేపీ కార్యాలయాన్ని కాంగ్రెస్ వర్గాలు ముట్టడించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. మల్లేశ్వరంలో కాసేపు ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. కాగా బెళగావిలో ఏఐసీసీ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనత్ మాట్లాడుతూ ప్రజ్వల్ అరాచకంగా వ్యవహరించారని ఎంతో మందిమహిళలపై దౌర్జన్యం చేశారన్నారు. 2023 డిసెంబరులోనే స్థానిక బీజేపీ నేతలు సూచించినా జేడీఎస్‌తో మైత్రి పెట్టుకుని ప్రజ్వల్‌కే టిక్కెట్ ఇవ్వడమంటే ముందుగానే తెలుసన్నారు. కాగా నగరంలోని ఫ్రీడం పార్కులో ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఆమ్ ఆద్మీపార్టీ కార్యకర్తలు కూడా నిరసనలో భాగస్వామ్యులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల ప్రజ్వల్‌కు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగాయి.


ఫ్రీడం పార్కులో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసన

● హుబ్బళ్లిలో మీడియాతో మాట్లాడిన కుమారస్వామి ప్రజ్వల్‌కంటే ప్రమాదకారి డీకే శివకుమార్ అంటూ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. సీఎం సిద్దరామయ్య ఈ విషయంలో దేవెగౌడ పేరు ప్రస్తావనపై కుమార విరుచుకుపడ్డారు. సిద్దరామయ్య కుమారుడు ఏ దేశానికి వెళ్లి ఏం జరిగిందో అప్పుడు అత్యవసరంగా విదేశాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాని మోదీ సహకరించారనే కనీస ఆలోచన కూడా లేకుండా మాట్లాడతారన్నారు. ప్రజ్వల్ ఉప్పు తిని ఉంటే నీరు తాగాల్సిందేనని ఇందులో ఎవరిని వెనకేసుకొచ్చేది లేదన్నారు. ప్రజ్వల్ ఎక్కడికి వెళ్తారనేది నాతోనూ లేక దేవెగౌడతో చెప్పి వెళ్తారా..? అంటూ మండిపడ్డారు.


కోర్ కమిటీ సమావేశంలో కుమారస్వామి, జీటీ దేవెగౌడ తదితరులు

రాష్ట్రంలో 800 మంది రైతుల ఆత్మహత్య

- కాంగ్రెస్ పాలనలో అన్నదాతకు తీరని అన్యాయం
- పరిహారం పట్ల కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం
- బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర ఆగ్రహం

బెంగళూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్రంలో 800మంది అన్నదాతలు ఆత్మహత్యకు పాల్పడినా ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మండిపడ్డారు. కలబురగిలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నింటా విఫలం చెందిందని సకాలంలో రైతులను ఆదుకోవడంలోనూ వారికి బాధ్యత లేదన్నారు. యడియూరప్ప సీఎంగా ఉన్నప్పుడు పంట నష్టం జరిగితే హెక్టారుకు రూ.14వేలు, ఉద్యాన పంటలకు రూ.24వేల పరిహారం ఇచ్చారన్నారు. ప్రస్తుతం సిద్దరామయ్య రూ.2వేలు బిచ్చం రూపంలో వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యడియూరప్ప సీఎంగా ఉన్నప్పుడు అతివృష్టి చోటు చేసుకుంటే పరిహారం మొత్తాన్ని పెంచారన్నారు. సిద్దరామయ్య తరహాలో ఢిల్లీ వెళ్లి నిరసన తెలపలేదన్నారు. రైతులకు పరిహారం ఇవ్వాలని ఢిల్లీలో ఆందోళన చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రానికి చెందిన రైతులను ఆదుకోవడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ముస్లింలకు 10వేలకోట్ల రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చే ముఖ్యమంత్రి రైతులు సమస్యల్లో ఉన్నప్పుడు ఐదారువేల కోట్ల రూపాయలు అత్యవసరంగా విడుదల చేయాలనేది గుర్తుకురాకపోవడం సరికాదన్నారు. కల్యాణ కర్ణాటకలో కరువు ఉండవచ్చునని, అయితే హృదయం విశాలమైనదన్నారు. యడియూరప్పతో కల్యాణ కర్ణాటకకు అవినాభావ సంబంధం ఉందన్నారు. బంజార సముదాయ అభివృద్ధికి యడియూరప్ప కట్టుబడి చేశారన్నారు. ఎంపీ అభ్యర్థి ఉమేశ్ జాధవ్, ఎమ్మెల్యేలు బసవరాజ్ మత్తిమూడ్, హరీశ్ పూంజా, ఎమ్మెల్సీ బీజీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

కొంప ముంచిన ఆన్‌లైన్ గేమ్స్

- ఇంట్లో చోరీలకు పాల్పడిన బాలురు
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో బట్టబయలు
- భారీగా నగదు, నగలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదు, నగలను పరిశీలిస్తున్న కమిషనర్ దయానంద్

బెంగళూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలైన విద్యార్థులు భారీగా ఇంట్లోని నగదు, బంగారు చోరీలకు పాల్పడడం పోలీసులనే ఆశ్చర్యానికి గురి చేసింది. మంగళవారం విలేకరుల సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ దయానంద్ తెలిసిన వివరాల మేరకు నగరంలోని ఆర్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐడియల్ హోమ్స్ నివాసి ఫిర్యాదు మేరకు పోలీసులు కార్యాచరణ నిర్వహించారు. తన కొడుకు, అతడి స్నేహితులు ఒకే తరగతి చదివేవారని ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై చోరీలకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంట్లోని సుమారు 600కుపైగా గ్రాముల నగలు తన స్నేహితుడికి ఇచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆరా తీశారు. నగలను పరిచయం ఉన్నవారికి ఇచ్చినట్లు బాలురు అంగీకరించారు. ఇందుకు సంబంధించి కొప్పళ జిల్లాలోని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా 10రోజుల పోలీస్ కస్టడీకి ఆదేశించారు. నిందితులనుంచి నగలను కరిగించిన 302 గ్రాముల బంగారం బిస్కట్‌లు, ఇతరత్రా సహా నగలను విక్రయించగా వచ్చిన రూ.23,50,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం విలువ రూ.41.50 లక్షలు ఉంటుందన్నారు. కేసును బెంగళూరు నగర పశ్చిమ విభాగం డీఎసీపీ గిరీశ్, బ్యాటరాయనపుర ఉపవిభాగం ఏసీపీ భరత్ ఎస్‌రెడ్డి నేతృత్వంలో రాజరాజేశ్వరినగర్ పోలీసులు కేసు ఛేదించారని కమిషనర్ వెల్లడించారు.


పురవీధులలో సాగుతున్న రథోత్సవం

గోవిందా.. గోవిందా..

● వైభవంగా వెంకటరమణ స్వామి రథోత్సవం

చింతామణి, ఏప్రిల్ 30: తాలూకాలోని ముంగానహళ్ళి హోబళి దండకారణ్య అంతర్గత సిద్ధారణ్యగా ప్రసిద్ధ క్షేత్రమైన కోనకుంట్లు వెంకటరవణస్వామి బ్రహ్మరథోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామస్థుల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా సాగాయి. సుప్రభాత సేవ, రథకానికి కళశ స్థాపన, అలంకారోత్సవం, రథానికి పుష్పాలంకరణ, మధ్యాహ్నం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు సాగాయి. భక్తుల గోవిందనామస్మరణ నడుమ రథోత్సవం సాగింది. పలువురు నాయకులు, ముఖ్యులు విశేషంగా పాల్గొన్నారు. రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు పానకం, మజ్జిగ పంపిణీ, అన్నదానం నిర్వహించారు. గరుడోత్సవం, పుష్పాలంకరణ సాగింది. యోగీశ్వర యాజ్ఞవల్క్య దేవాలయ సంఘం పదాధికారులు సహా చుట్టుపక్కల గ్రామస్థులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


దాడుల్లో లోకాయుక్త అధికారులు

లోకాయుక్త వలలో ఈఓ

శిడ్లఘట్ట, ఏప్రిల్ 30: లోకాయుక్త దాడుల్లో క్యబళ్ళాపుర ఈఓ పట్టుబడ్డారు. మంగళవారం శిడ్లఘట్ట తాలూకా కార్యనిర్వహణాధికారి మునిరాజును అధికారులు వల వేసి పట్టుకున్నారు. జంగమకోటి హోబళి గట్టుమారనహళ్ళికి చెందిన నంజేగౌడ నుంచి ల్యాండ్ కన్వర్షన్ కోసం రూ.2లక్షలు డిమాండ్ చేయగా రూ.1.50 లక్షలు ఇచ్చేలా అంగీకరించారు. నంజేగౌడ, మునిరాజుకు నగదు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. దాడుల్లో లోకాయుక్త ఎస్పీ డాక్టర్ ఎల్ రామహర్షిపి, డీఎస్పీ పీ వీరేంద్రకుమార్, ఎస్సై మోహన్, శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి నేతలను సమర్థిస్తారా..?

● బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా

బెంగళూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమిలో పలువురు కీలక నేతలు అవినీతిలో కూరుకుపోయి బెయిల్‌పై ఉన్నారని వారిని సమర్థిస్తారా లేదా పదేళ్లలో ప్రపంచమే భారత్‌వైపు చూసేలా అభివృద్ధి చేసిన ప్రధాని నరేంద్రమోదీకి మద్దతు ఇస్తారా అంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా పేర్కొన్నారు. హావేరి జిల్లా బ్యాడగిలో మంగళవారం నడ్డా రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియా కూటమిలో రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, చిదంబరం, లాలూ ప్రసాద్‌యాదవ్, డీకే శివకుమార్ బెయిల్‌పై ఉన్నారని అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియాలు జైల్లో ఉన్నారన్నారు. మమతా కేబినెట్‌లోని మంత్రులు జైలులో ఉన్నారన్నారు. బసవరాజ్‌బొమ్మైకు మద్దతు ఇచ్చి ఢిల్లీకి పంపాలని సూచించారు.


హావేరి రోడ్‌షోలో జేపీ నడ్డా, బసవరాజ్ బొమ్మై తదితరులు


ఎవరు పిలిచినా వస్తాం.. నచ్చినోడికి ఓటేస్తాం !



ఎన్నికల వేళ గ్రామాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. కొంతమంది ఏ పార్టీ నాయకులు పిలిచిన ర్యాలీ, ప్రచారానికి వెళ్తున్నారు. ఇదే విషయాన్ని కొందరు నేతలు వారిని ప్రశ్నిస్తే నా ఓటు నీకే వేస్తామన్నా అని చెబుతున్నారు. దీంతో అభ్యర్థులలో అయోమయం నెలకొంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు ఎటువంటి ఇబ్బంది ఉండరాదన్న ఉద్దేశ్యంతోనే కొందరు అలా ప్రవర్తిస్తున్నట్టు తెలుస్తోంది. టీడీపీ, వైసీపీ నాయకులు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో ఘనంగా స్వాగతం పలకాలన్న ఉద్దేశ్యంతో గ్రామస్థాయి నాయకులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రచారానికి రావాలని కోరుతున్నారు. దీంతో ఇరు పార్టీలకు జనం తండోపతండాలుగా వస్తున్నారు. దీంతో వీరు ఎవరికి ఓటు వేస్తారో అన్న అయోమయంలో పార్టీల నాయకులు, అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. కొంత మంది మాత్రం ప్రచారానికి వస్తాం, ఎన్నికల సమయంలో మాకు నచ్చిన వారికి ఓటు వేస్తామని నిక్కచ్చిగా చెబుతున్నారు. ఈక్రమంలో పోటీలో ఉన్న అభ్యర్థులు గ్రామాల్లో ప్రజలు నాడిని కనుక్కునేందుకు సొంత సర్వేలు చేయించుకుంటున్నారు.

- కొత్తచెరువు

ఖైదీలకు ఓటు హక్కు ఉంటుందా?



భారత రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన భారతీయపౌరులు ఓటు హక్కు ఉంటుంది. వివిధ కారణాల వలన జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఓటు హక్కు ఉంటుందా? ఉండదా అనే ప్రశ్న చాలా మందికి తలెత్తవచ్చు. అయితే ఖైదీలు కూడా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశముంది. వివిధ నేరాల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ప్రీవెంక్యూ డిటర్మినేషన్ పద్ధతిలో ఓటు వేయవచ్చు. నియోజకవర్గం పేరును సూచిస్తూ, తాము ఓటర్లమని, పోలింగ్ బూత్, ఓటరు క్రమ సంఖ్యతో ఓటు వేసే అవకాశం కల్పించాలని రాత పూర్వకంగా జైలర్‌ను కోరాలి. ఖైదీలు సూచించిన ప్రాంతాలనుంచి పోస్టల్ బ్యాలెట్‌ను తెప్పించి, ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

- కదిరిఅర్బన్

ఓటు వేయడానికి ఇవి చూపిస్తే చాలు



వచ్చే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా ప్రత్యామ్నాయంగా వివిధ గుర్తింపు పత్రాలు చూపించి ఓటు వేసే అవకాశాన్ని భారత ఎన్నికల కమిషన్ కల్పించింది. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులను ఎన్నికల కమిషన్ ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఓటు వేయడానికి ముందు పోలింగ్ కేంద్రంలో వారి గుర్తింపు నిర్ధారణకు పంపిణీ చేసిన ఓటరు స్లిప్పులు మాత్రమే చూపిస్తే సరిపోదు. ప్రభుత్వం జారీ చేసిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటు వేయవచ్చని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ కార్డులు ఇవే..

ఆధార్‌కార్డు, ఎంఎన్ఆర్‌జీఏ, పాన్‌కార్డు, పోస్టాఫీసు లేదా బ్యాంకు జారీ చేసిన ఫొటో ఉన్న పాసు పుస్తకం, హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, ఇండియన్ పాస్‌పోర్టు, ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్‌కార్డు, ఫొటోతో కూడిన పింఛన్ మంజూరు డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ కార్డు, దివ్యాంగుల ఐడీ కార్డు, ఎమ్మెల్యే, ఎంపీలు జారీ చేసిన అధికార గుర్తింపు పత్రం పోలింగ్ కేంద్రంలో చూపించి ఓటు హక్కును వినియో గించుకోవచ్చు.

- కొత్తచెరువు

జన కేతనం

ఆంధ్రజ్యోతి

పెనుకొండ విజయంలో...

గోరంట్లే కీలకం..!



గోరంట్ల పాతబస్టాండ్ కూడలిలో నీడనిస్తున్న మర్రిచెట్టు

గోరంట్ల, ఏప్రిల్ 30: పెనుకొండ నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించేది గోరంట్ల ఓటర్లే. నియోజకవర్గంలోని అన్ని మండలాకంటే గోరంట్లలో అత్యధికంగా 64,434 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 32,050 మంది పురుషులు, 32,380 మంది మహిళలు, ఇద్దరు థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు. మండల ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపితే ఆ అభ్యర్థే గెలుస్తారని తెలుస్తోంది. పెనుకొండ నియోకవర్గంలో మొత్తం 265 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,35,986 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,17,952 మంది పురుషులు, 1,18,030 మంది మహిళలు, 4 థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు. మిగిలిన మండల్లాలో.. పెనుకొండ అర్బన్‌లో 22,138 మంది, రూరల్‌లో 23,075, సోమందేపల్లిలో 39,273, పరిగిలో 46,500, రొద్దంలో 40,568 మంది ఓటర్లు ఉన్నారు. గోరంట్ల మండలంలో అధిక శాతం ఓట్లు ఉండడంతో కీలకంగా మారుతోంది. దీంతో అన్నిపార్టీల అభ్యర్థులు గోరంట్ల మండలంపై ప్రత్యేక దృష్టి సారించడం ఆనవాయితీగా వస్తోంది.

అప్పట్లో కొందరికే ఓటు హక్కు..



ఇప్పుడంటే దేశంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు వేస్తున్నారు కానీ ఒకప్పుడు అలా ఉండేది కాదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో ఉద్యోగులు, చదువుకున్నవారు, భూస్వాములకు మాత్రమే ఓటు వేసే అవకాశం ఉండేది. అప్పట్లో మండలాలను ఫిర్కాలుగా పిలిచేవారు. ప్రస్తుత వీఆర్ఓలకు బదులుగా అప్పుడు వీఎం(విలేజ్ మేజిస్ట్రేట్)లు ఉండేవారు. వీరివద్దే ఓటర్లుగా నమోదు చేయించుకునే వారు. ప్రత్యక్ష పద్ధతిలో బహిరంగసభలో చేతులెత్తి ఓటు హక్కును వినియోగించుకునే వారు. 1952, 1951లో ఒక అభ్యర్థికి ప్రత్యేకంగా ఒక పెట్టె ఏర్పాటు చేసేవారు. వాటిలోనే ఓటువేసేవారు. అనంతరం అభ్యర్థులు ఎందరైనా ఒకే పెట్టెలో ఓటువేసే విధానం వచ్చింది. బ్యాలెట్ ఓటు విధానం అనంతరం, ఈవీఎంలను ఎన్నికల్లో వినియోగించడం ప్రారంభమైంది.

- హిందూపురం



మల్లయ్య కాలనీ

ఆ కాలనీ అనంతపురం నగరానికి కూత వేటు దూ రంలో ఉంది.. అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో ఉంది. రూరల్ మండలంలోని మల్లయ్యకాలనీ (అన్నెఫెర్రర్ కాలనీ)లో కనీస సౌకర్యాలు లేక సతమతమవుతున్నారు. గత ఎన్నికలకు ముందు రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి కుటుంబికులు ప్రచారానికి వెళ్లినప్పుడు సమస్యలన్నీ పరిష్కరిస్తామ ని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గె లిచాక ఐదేళ్లలో ఒక్కసారంటే ఒక్కసారి కూడా కాలనీ వైపు తొంగిచూడలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లయింది.. మళ్లీ రాలేదు..!

- అభివృద్ధికి నోచుకోని మల్లయ్య కాలనీ
- గత ఎన్నికల్లో అభివృద్ధికి హామీలు
- మౌలిక వసతులు లేక అవస్థలు
- రాప్తాడు ఎమ్మెల్యేపై కాలనీవాసుల ఆగ్రహం





కాలనీలోని ప్రధాన రోడ్డు

అనంతపురం రూరల్

అక్కడ ఉన్న వారంతా పేదలే. కూలి పనులకు వెళితే తప్పా పూట గడవని పరిస్థితి. కాలనీ ఏర్పడి దశాబ్ద కాలం గడుస్తున్నా కనీస మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నారు. అనంతపురం రూరల్ మండలం చిన్నంపల్లి పంచాయతీ మల్లయ్యకాలనీ (అన్నె ఫెర్రర్ కాలనీ) దుస్థితిని పట్టించుకునే నాథుడే లేడు. నగరానికి ఐదు కిలో మీటర్లు దూరంలో ఉన్నా అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో ఉంది. కాలనీలో దాదాపు 200 కుటుంబాలకు పైగా నివాసముంటున్నాయి. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా తన కుటుంబ సభ్యురాలు ఒకరిని పంపి ప్రచారం చేయించారు. వైసీపీ అధికారంలోకి వస్తే కాలనీ రూపురేఖలు మారుస్తామని, రోడ్లు, కాలువలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని హామీలు ఇచ్చారు. దీంతో స్థానికులు వైసీపీ అధికారంలోకి వస్తే కాలనీ అభివృద్ధి చెందుతుందన్న ఆశతో ఓట్లు వేసి గెలిపించారు. అంతంటితో సరి. ఆ తరువాత హామీలు ఇచ్చిన దూతకానీ, రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి కానీ ఐదేళ్లలో ఒక్కసారంటే ఒక్కసారి కూడా కాలనీ వైపు చూసింది లేదంటున్నారు స్థానికులు. ఇటీవలే కాలనీలో ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే కాలనీ ఇలా ఉందని తాను అనుకోలేదని.. ఈసారి గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారని కాలనీ వాసులు చెబుతున్నారు. తమను ఓటర్లుగా మాత్రమే చూస్తున్నార తప్పా, కాలనీ అభివృద్ధి గురించి పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాలనీ ఏమాత్రం మారలేదు

మేము కాలనీ ఏర్పాటయినప్పటి నుంచి ఉంటున్నాం. అప్పటికి ఎలా ఉందో..ఇప్పటికీ అలాగే ఉంది. ఏమాత్రం మార్పు లేదు. రాత్రివేళల్లో విషపురుగులు సంచరిస్తున్నాయి. మరో చోటుకు వెళ్లలేము. మా కష్టాలు మాకు తప్పవు. ఎన్నికల సమయంలో నాయకులు రావడం హామీలు ఇవ్వడం తప్పా చేసిందేమీ లేదు. కాలనీలోకి వచ్చేందుకు బ్రిడ్జి, రోడ్లు, కాలువలు వేయిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఏదీ జరగలేదు.

- రమాదేవి, కాలనీవాసి





ఒక్క హామీ కూడా నెరవేరలేదు

గత ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరుడు చందు భార్య కాలనీలో ప్రచారం నిర్వహించారు. అప్పుడు కాలనీలో రోడ్లు, కాలువలు, ఇతర సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని చెప్పివెళ్లారు. ఇంతవరకు ఒక్క హామీ కూడా నెరవేరలేదు. అంతేకాదు.. కాలనీలో టీడీపీ సానుభూతిపరులెవరైనా బియ్యం కోసం ఒక్కటి రెండు రోజులు ఆలస్యం అయితే డీలర్ బియ్యం అయిపోయాయంటూ వెనక్కు పంపించేస్తున్నారు. కాలనీలో పరిస్థితి అధ్వానంగా ఉంది. వైసీపీ నాయకులు చెప్పినట్లు వింటే సరి లేదంటే గొడవలు సృష్టించేస్తారు. ఈ గొడవలు పడలేక చాలా మంది వెళ్లిపోయారు.

- గుల్జారమ్మ, కాలనీవాసి





కాలనీలో లేని రోడ్డు కాలువలు

ఏ నాయకుడూ రాలేదు

కాలనీలో ఎనిమిదేళ్లుగా నివాసముంటున్నాం. ఏనాడూ.. ఏ నాయకుడు కాలనీ వైపు వచ్చింది లేదు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే మేము కనిపిస్తున్నాం. ఓట్లు వేయించుకుని గెలిచిన నాయకులకు మేము..మా కాలనీ కనిపించదు. రోడ్లు, కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఏడాది కిందట వర్షం వచ్చినప్పుడు ఇళ్లలోకి నీరు చేరాయి. ఎవరూ ఇటువైపు వచ్చి మా సమస్యలు అడిగింది లేదు. కాలనీ వాసులమంతా వారం పదిరోజులు ఎన్ని ఇబ్బందులు పడ్డామో మాకే తెలుసు.

- అరుణ, కాలనీవాసి

కలగా మిగిలిన రింగ్‌రోడ్డు



రింగ్‌రోడ్డు గురించి అధికారులతో టీడీపీ నాయకుల చర్చ(ఫైల్)

టీడీపీ పాలనలో మడకశిర పట్టణాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ఔటర్ రింగ్ రోడ్డు పనులు ప్రారంభించారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పనులు నిలిచిపోయాయి. టీడీపీ పాలనలో నాయకులు ఎంతో కష్టపడి పట్టణం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించడానికి రైతుల నుంచి 15 ఎకరాల భూమి సేకరించారు. చౌటిపల్లి గ్రామ సమీపంలో రోడ్డు పనులు కూడా ప్రారంభించారు. ఆ సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ దాని గురించి పట్టించుకోలేదు. దీంతో ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం తమకు కలగానే మిగిలిందని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

-మడకశిర రూరల్

పెరిగిన జంపింగ్‌లు



సార్వత్రిక ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు అంటూ కార్యకర్తలు, నాయకుల జంపింగ్‌లు అధికమయ్యాయి. పార్టీలో చేరే వారికి నిత్యం కండువాలు కప్పడానికే అభ్యర్థులకు సగం సమయం సరిపోతోంది. ప్రధాన పార్టీలకు చెందిన కొందరు స్థానిక నాయకులు రాజకీయంగా క్రియాశీలకంగా లేని అవతలి పార్టీ కార్యకర్తలను సైతం తమ పార్టీ అభ్యర్థులు, నాయకుల వద్దకు తీసుకెళ్లి వారి గురించి గొప్పలు చెప్పి పార్టీ కండువాలు వేయించేస్తున్నారు. ఇప్పటివరకు ఉన్నపార్టీని వీడి హఠాత్తుగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలతో అవతలి పార్టీలో చేరుతుండటంతో ఆయా అభ్యర్థులు సైతం ఆశ్చర్యపోతున్నారు. మరోవైపు వీరందరూ కోవర్టులేమోనన్న భయం కూడా వారిని వెంటాడుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ధర్మవరం పట్టణంతోపాటు మండలాల్లో కూడా చేరికలు ఎక్కువగా జరుగుతున్నాయి.

- ధర్మవరం

అన్నన్నా !

నోటికాడ కూడు లాగేశారు..!



బళ్లారి బైపాస్ సర్కిల్‌లోని అన్న క్యాంటీన్ భవనం

ఇక్కడ కనిపిస్తున్న భవనం బళ్లారి బైపాస్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్. టీడీపీ హయాంలో నిత్యఅన్నదాన సత్రంలా కళకళలాడింది. ఎంతో మంది ఆకలి తీర్చింది. చుట్టుపక్క ప్రాంతాలు, వివిధ పనులపై నగరానికి వచ్చిన వారు వచ్చి ఈ క్యాంటీన్‌లో ఐదు రూపాయలకే కడుపు నిండా అన్నం తినేవారు. వందల మంది కూలీలు, హమాలీలకు బైపాస్ సర్కిల్ కేంద్ర బిందువు. వారందరికీ ఈ క్యాంటీన్ కడుపునింపింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ క్యాంటీన్‌ను మూసివేశారు. ప్రస్తుతం ఆ భవనం మున్సిపాలిటీ అవసరాల కు మాత్రమే ఉపయోగపడుతోంది. భవనం అద్దాలు పగిలిపోయాయి. భవనం చెత్త చెదారం, దుమ్ము, ధూళితో నిండిపోయింది. ఎంతో మందికి అన్నం పెట్టిన క్యాంటీన్ మూసివేయడం అంటే పేదల నోటి కాడ..కూడు లాగేసుకోవడమేనని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- అనంతపురం రూరల్

యువతే భవిత

ఎన్నికల్లో వీరిదే కీలకపాత్ర
ఎటువైపు మొగ్గితే అటువైపే విజయం
గత ఐదేళ్లలో యువజన సంఘాలు నిర్వీర్యం
ఓట్ల కోసం వ్యసనాలకు బానిసలుగా మారుస్తున్న పార్టీలు

హిందూపురం

దేశ అభివృద్ధి, భవిష్యత్తును నిర్దేశించేది ఆ దేశ యువతే. బాధ్యతాయుతమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో వీరిదే కీలక పాత్ర. ప్రపంచీకరణకు ముందు మేలైన సమాజ నిర్మాణంలో కూడా యువత చైతన్యవంతంగా ఉండేది. ఇందు కోసం యువజన సంఘాలు సైతం ఏర్పడ్డాయి. అందుకే ఎన్నికల సమయంలో వివిధ పార్టీల అభ్యర్థులు వీరి మద్దతు కోసం తీవ్రంగా ప్రయత్నించేవారు. కాలక్రమేణ యువజన సంఘాలు కనుమరుగయ్యాయి. ఈక్రమంలోనే చైతన్యానికి మారుపేరుగా నిలిచిన యువతను కొన్ని పార్టీలు, కొందరు నాయకులు తమ రాజకీయ ప్రయోజనాలు, ఓట్ల కోసం వ్యసనాలకు బానిసలుగా మారుస్తున్నారు.

వారంటే ప్రత్యేక గౌరవం



ఒకప్పుడు సామాజిక రుగ్మతలపై యువజన సంఘాలు నిరంతరం కార్యకలాపాలు నిర్వహించేవారు. అక్షరాస్యత శాతాన్ని పెంచడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే యువకుల్లో మార్పు తీసుకురావడంలో, స్థానిక సంస్థల పరిష్కారానికి కృషిచేసేవి. వీటితోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించేవారు. శారీరక పటుత్వం కోసం వ్యాయామశాలలు నిర్వహించే వారు. దాదాపు అన్ని ప్రాంతాల్లో యువజన సంఘాలు కొనసాగుతుండేవి. అనంతర కాలంలో ప్రాచుర్యం పొందిన క్రికెట్ పోటీలు నిర్వహిస్తూ సత్సంబంధాలు నడిపేవారు. అదే సమయంలో చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించేవారు. పల్లెల్లో పట్నాల్లో జాతరలో సామూహిక కార్యక్రమాల్లో వలంటీర్లుగా సేవలందించేవారు. ప్రభుత్వాలు కూడా యువజన సంఘాలతో కలిసి పలు కార్యక్రమాలు నిర్వహించేవి. దీంతో యువజన సంఘాల సభ్యులకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఉండేది. విద్యాసంస్థల్లో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లో కూడా అధికంగా చేరేవారు. కానీ నేడు ఇలాంటివి కనుమరుగవుతున్నాయి.

యువజన సంఘాలు కనుమరుగు

జీవన అలవాట్లు, ఆలోచనవిధానాలు, సమాజ పోకడలు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా యువజన సంఘాలు కనుమరుగవుతున్నాయి. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో అందరిచేతుల్లో స్మార్ట్‌ఫోన్‌లు వచ్చి చేరాయి. దీంతో కొందరు విజ్ఞానం పొందుతుండగా మరికొందరు పెడత్రోవపడుతున్నారు. ప్రభుత్వాలు కూడా యువజన శాఖను పూర్తి నిర్లక్ష్యం చేయడంతో ఆశాఖ ద్వారా నిర్వహించాల్సిన కార్యకలాపాలకు స్వస్తి పలికారు. గడచిన ఐదేళ్లలో యువజన సంఘాలను పూర్తిగా నిర్వీర్యం చేశారు.

నిలదీతే పరిష్కారం

యువతను పెడత్రోవ పట్టిస్తూ స్వప్రయోజనాలు చూసుకుంటున్న నాయకులను నిలదీయడమే ఇందుకు పరిష్కారమని సామాజికవేత్తలు అంటున్నారు. ఓటును వజ్రాయుధంగా వాడాలని సూచిస్తున్నారు. ఫిరాయింపులు, మద్యం పంపిణీ, గొడవలకు యువతను ముందుంచడం పై ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. ఈ ఐదేళ్లలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కడా కనిపించలేవు. దీంతో అలాంటి నాయకులు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు నిలదీయాలని సూచిస్తున్నారు.

ఎన్నికల ప్రభావంతో యువతను వ్యసనాలకు బానిసలుగా మారుస్తున్న నాయకులకు ఓటుద్వారా బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గెలుపోటముల్లో కీలకం

ఎన్నికల సమయంలో అభ్యర్థుల గెలుపోటములు యువతపైనే ఆధారపడి ఉంటాయి. ఎందుకంటే ఎన్నికల్లో యువత ఓటు శాతం అధికంగా ఉంది. దీనివల్ల వారు ఎటువైపు మొగ్గు చూపితే అటువైపు విజయం సాధించే అవకాశం ఉంటుంది. దీంతో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు యువతపై ఓ కన్నేసి వారి ఓట్లను పొందేందుకు మార్గాలను అన్వేషిస్తున్నాయి.

ఎన్నికల్లో అధికారులే కీలకం

జిల్లా, గ్రామస్థాయి వరకు ప్రధానపాత్ర.. వారి పర్యవేక్షణలోనే ఎన్నికల సమరం

ధర్మవరం

సార్వత్రిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడంలో అధికారుల పాత్ర కీలకం. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ అధికారులదే కీలక పాత్ర. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ పర్యవేక్షణకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రధాన ఎన్నికల అధికారిని సంప్రదిస్తుంది. ఆయన పర్యవేక్షణలోనే ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో జిల్లా, నియోజకవర్గ, మండలం, గ్రామస్థాయిలో పనిచేసే అధికారులు వివరాలు ఇలా...

జిల్లా ఎన్నికల అధికారి

ప్రధాన ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ప్రతి జిల్లాకు ఎన్నికల అధికారి ఉంటారు. పాలనాధికారి(కలెక్టర్)ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమలు చేయడంలో కలెక్టర్ ప్రధాన పాత్ర పోషిస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేస్తారు.

రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ)

ఎన్నికల నిర్వహణకు కేంద్రం రిటర్నింగ్ అధికారిని నియమిస్తుంది. ఈ అధికారి సంబంధిత నియోజకవర్గాలను పర్యవేక్షిస్తారు. నామినేషన్ ప్రక్రియ, తుది జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించడానికి సిబ్బంది నియామకం. వారికి శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి అంశాలు ఆర్‌ఓ పర్యవేక్షణలోనే జరుగుతాయి.

సెక్టోరియల్ అధికారి

8-10 పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించడానికి సెక్టోరియల్ అధికారులను నియమిస్తారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. అవసరమైతే పరిస్థితులకు అనుగుణం గా ఆయా చోట్ల 144 సెక్షన్ విధించే అధికారి ఆయనకు ఉంటుంది.

ఓటర్ల నమోదు అధికారి

ఓటర్ల నమోదు అధికారి ప్రతి నియోజకవర్గ స్థాయిలో ఉంటారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునేవారు, జాబితాలో పేర్లు, ఫొటోలు తప్పుగా ఉన్నవారంతా ఆయనను సంప్రదించాలి. ఆయన పర్యవేక్షణలోనే సిబ్బంది ఓటరు జాబితాఅతయారు చేస్తారు.

ప్రిసైడింగ్ అధికారి


ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారి(పీఓ) ఉంటారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించి, అనంతరం వాటిని స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చేవరకు వీరిదే బాధ్యత. వీరితో పాటు సహాయ ప్రిసైడింగ్ అధికారు(ఏపీఓ)లు ఉంటారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని కార్యకలాపాలు పీఓ పర్యవేక్షణలో జరుగుతాయి.

సూక్ష్మ పరిశీలకులు

ఎన్నికలు జరిగిన తీరు, పర్యవేక్షణపై నివేదిక రూపొందించి కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించడానికి సూక్ష్మ పరిశీలకులను ఏర్పాటు చేస్తారు. ప్రతి మండలానికి ఒకరు ఉంటారు. వారంతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తారు.

బూత్ లెవల్ అధికారి (బీఎల్‌ఓ)

ప్రతిపోలింగ్ కేంద్రానికి బూత్ లెవల్ అధికారి ఉంటారు. కొత్తగా ఓటరు జాబితాలో చేరే వారికి ఫాం-6, తొలగింపునకు ఫాం-7, తప్పుల సవరణకు అవసరమైన ఫారాలు ఇవ్వడం, అర్హులైన వారంతా ఓటు నమోదు చేసుకునేలా చూడటం, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ప్రతి పాదించడం, ఓటర్ల జాబితా ప్రదర్శన, కేంద్రాల్లో మార్పులకు బీఎల్‌ఓలు పనిచేస్తుంటారు.



నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కాశీనాథుని నాగేశ్వరరావు (జయంతి)



'కళాప్రపూర్ణ' కాశీనాథుని నాగేశ్వర రావు 1867 మే 1న కృష్ణా జిల్లా ఎలకుర్రులో జన్మించారు. తెలుగు జాతికి, తెలుగు భాషకు, తెలుగు సంస్కృతికి ఆయన చేసిన సేవలు అపారం. పాత్రికేయుడు, వ్యాపారవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ నాయకుడు, గ్రంథాలయాల విస్తరణకు కృషి చేసిన విద్యావేత్త, దానశీలి, ఖాదీ ఉద్యమాన్ని ప్రోత్సహించిన నాయకుడు. 1929లో ఏర్పాటైన ఆంధ్రనాటక కళా పరిషత్ సంస్థాపకులలో ఒకరు. ఆంధ్రపత్రిక, అమృతాంజనం సంస్థలను స్థాపించారు. 'నాగేశ్వరరావు పంతులు'గా పిలవబడ్డారు. 'దేశోద్ధారక', 'విశ్వదాత' అనే గౌరవాలు అందుకున్నారు. 1938 ఏప్రిల్ 11న కన్నుమూశారు.

పుచ్చలపల్లి సుందరయ్య (జయంతి)



కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన పుచ్చలపల్లి సుందరయ్య 1913 మే 1న నెల్లూరు జిల్లాలో భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణ రైతాంగ సాయుధపోరాట వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు. తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ఒకరు. కుల వ్యవస్థను నిరసిస్తూ తన పేరు సుందర రామిరెడ్డిలోని 'రెడ్డి'ని తొలగించుకున్నారు. సహచరులు కామ్రేడ్ పీఎస్ అని పిలిచేవారు. సుదీర్ఘకాలం పార్లమెంటు సభ్యుడిగా కొనసాగినా నిరాడంబరంగా, ఆదర్శ జీవితం గడిపారు. 1985 మే 19న కన్నుమూశారు.

బాల్‌రాజ్ సాహ్ని (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత బాల్‌రాజ్ సాహ్ని 1913 మే 1న పంజాబ్ రాష్ట్రం రావల్పిండిలో జన్మించారు. రంగస్థల నటుడిగా, సినీ నటుడిగాను పేరొందారు. బెంగాల్ శాంతినికేతన్‌లోని విశ్వభారతి యూనివర్శిటీలో ఆంగ్ల, హిందీ ఉపాధ్యాయుడిగా పని చేశారు. బీబీసీ లండన్‌కు రేడియో వ్యాఖ్యాతగా వ్యవహరించారు. 'ఇన్‌సాఫ్' సినిమాతో కెరీర్ ప్రారంభించి రాణించారు. పంజాబీ సాహిత్యంలోనూ గుర్తింపు పొందారు. ఆలిండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) కు తొలి అధ్యక్షుడు. 1973 ఏప్రిల్ 13న కన్నుమూశారు.

మన్నాడే (జయంతి)



దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత మన్నాడే 1919 మే 1న కోల్కత్తాలో జన్మించారు. ఆయన అసలు పేరు ప్రబోధ్ చంద్ర డే. రంగస్థలంపై 'మన్నాడే'గా పేరొందారు. నేపథ్య గాయకుడిగా, సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందారు. శాస్త్రీయ సంగీతంలో 'భేండి బజార్ ఘరా నా'లో రాణించారు. హిందీ సినీరంగంలో 4వేలకుపైగా పాటలతో తనదైన రికార్డు సృష్టించారు. పలు ప్రాంతీయ భాషలలో పాటలు పాడారు. 'పద్మశ్రీ', 'పద్మ భూషణ్', పద్మ విభూషణ్ తదితర అత్యున్నత పురస్కారాలు అందుకున్నారు. 2013 అక్టోబరు 24న కన్ను మూశారు.

మల్లాది సూరిబాబు (పుట్టినరోజు)



మల్లాది సూరిబాబు 1945 మే 1న విజయవాడలో జన్మించారు. కర్ణాటక సంగీత గాయకుడు, కళాకారుడు. ఆలిండియా రేడియోలో చిన్నపిల్లల సంగీత కార్యక్రమాలతో శ్రోతలను అలరించారు. ప్రోగ్రామ్ అనౌన్సర్‌గా 35ఏళ్లపాటు పనిచేశారు. ఆయన ఆధ్వర్యంలోని భక్తిరంజని, సంగీత శిక్షణ కార్యక్రమాలు ఎంతో పేరొందాయి. దేశ విదేశాలలో సంగీత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 2,500కుపైగా పాటలకు స్వరకల్పన చేశారు. 'కళారత్న', సప్తగిరి సంగీత విద్వన్మణి, కళాప్రపూర్ణ తదితర పురస్కారాలు పొందారు.

అజిత్‌కుమార్ (పుట్టినరోజు)



అజిత్‌కుమార్ 1971 మే 1న సికింద్రాబాద్‌లో జన్మించారు. తమిళ సినీ నటుడు. 50కుపైగా సినిమాలలో నటించారు. 4 విజయ్ అవార్డులు, 3 సినిమా ఎక్స్‌ప్రెస్ అవార్డులు, 3 ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్, 3 తమిళనాడు రాష్ట్ర సినీ అవార్డులు అందుకున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మళయాళం, ఆంగ్ల భాషలలో అనర్గళంగా మాట్లాడగలడు. అంతేకాక మోటార్ కార్ రేసర్‌గా రాణించారు. మలేషియా, జర్మనీ తదితర దేశాల రేసులలో పాల్గొని ఇంటర్నేషనల్ అరెనా, ఫార్ములా ఛాంపియన్‌షిప్ సాధించారు. మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి యూఏవీ సిస్టమ్ అడ్వైజర్‌గా ఉన్నారు.

అనుష్క శర్మ (పుట్టినరోజు)



అనుష్కశర్మ 1988 మే 1న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో జన్మించారు. సినీ నిర్మాత, అత్యధిక పారితోషికం అందుకుంటున్న నటిగా రాణించారు. ప్రత్యేకించి బాలీవుడ్‌లో పేరొందారు. పలు సంస్థల ఉత్పత్తులకు రాయబారిగా వ్యవహరిస్తున్నారు. ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు, ఇతర అవార్డులు పొందారు. లింగ సమానత్వం, మూగ్రప్రాణుల హక్కులపై పోరాటం చేస్తున్నారు. క్రికెటర్ విరాట్ కోహ్లిని పెళ్లాడారు.


చిక్కోడిలో అదృష్టం చిక్కేదెవరికో..?



● రెండోసారి బరిలో అణ్ణాసాహెబ్ జొల్లె ● జార్కిహోళి కుటుంబం నుంచి ప్రియాంక ● సీనియర్, జూనియర్ల మధ్యే పోటీ

బెంగళూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చివరి ప్రాంతంగా అటు మహారాష్ట్ర, గోవాల సరిహద్దు కలిగిన చిక్కోడి లోక్‌సభ నియోజకవర్గంలో అదృష్టం ఎవరికి చిక్కెనో అనే అంశం చర్చనీయాంశమైంది. దశాబ్దాలపాటు కాంగ్రెస్‌కు కంచుకోటగా సాగిన చిక్కోడి నియోజకవర్గం ఇటీవల 20ఏళ్లుగా బీజేపీ అభ్యర్థులకు స్థావరంగా మారింది. ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా రెండో సారి అణ్ణాసాహెబ్ జొల్లె బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి మంత్రి సతీశ్‌జార్కిహోళి కుమార్తె ప్రియాంక జార్కిహోళి పోటీ చేస్తున్నారు.

● 1967 నుంచి 1999 దాకా చిక్కోడి రిజర్వు నియోజకవర్గంగా ఉండేది. కేంద్ర మంత్రిగా పని చేసిన సీనియర్ నేత బీ శంకరానంద 1967 నుంచి 1991 వరకు వరుసగా ఏడుసార్లు కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలుపొందారు. 1996లో తొలి మహిళా ఎంపీగా జనతాదళ్ నుంచి రత్నమాల సవనూరు విజయం సాధించారు. ప్రస్తుతం విజయపుర ఎంపీగా కొనసాగుతున్న రమేశ్ జిగజిణగి 1998లో లోక్‌శక్తి నుంచి, 1999లో జేడీయూ నుంచి, 2004లో బీజేపీ నుంచి విజయం సాధించారు. 2009లో రమేశ్‌కత్తి బీజేపీ ఎంపీగా గెలుపొందారు. 2014లో రమేశ్ హుక్కేరి కాంగ్రెస్ నుంచి గెలుపు సాధించడం ద్వారా మరోసారి కాంగ్రెస్‌కు ఇక్కడ బలం చేకూర్చారు. 2019 ఎన్నికల్లో పోటాపోటీ అనిపించిన అణ్ణాసాహెబ్ జొల్లె కాంగ్రెస్ అభ్యర్థి ప్రకాశ్‌హుక్కేరిపై గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లో రమేశ్‌కత్తికి బీజేపీకి టిక్కెట్ లభిస్తుందని ప్రచారం సాగినా అధిష్ఠానం మాత్రం అణ్ణాసాహెబ్ జొల్లెకు టిక్కెట్ కేటాయించింది. రమేశ్‌కత్తి అలకబూని కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం సాగినా ఆయన పార్టీని వీడలేదు. కాంగ్రెస్ నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి జార్కిహోళి కుటుంబం నుంచి మరో వారసురాలు వచ్చారు. ప్రస్తుతం జార్కిహోళి కుటుంబంలో కాంగ్రెస్, బీజేపీల నుంచి నలుగురు కీలక హోదాల్లో ఉన్నారు. ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేసిన సతీశ్‌జార్కిహోళి ప్రస్తుతం సిద్దరామయ్య కేబినెట్‌లో కీలకమైన ప్రజాపనులశాఖను నిర్వహిస్తున్నారు. కుమార్తె ప్రియాంక జార్కిహోళి అభ్యర్థి అయ్యారు.



అణ్ణాసాహెబ్ జొల్లె

17.30 లక్షలమంది ఓటర్లు

● చిక్కోడి పరిధిలో నిప్పాణి (బీజేపీ), చిక్కోడి - సదలగ (కాంగ్రెస్), అథణి (కాంగ్రెస్), కాగవాడ (కాంగ్రెస్), కుడచి (కాంగ్రెస్), రాయబాగ్ (బీజేపీ), హుక్కేరి (బీజేపీ), యమకనమరడి (కాంగ్రెస్) ఎమ్మెల్యేలు ఉన్నారు. కులాల ప్రకారం 4.10 లక్షలకుపైగా లింగాయత ఓటర్లు ఉండగా ఎస్సీలు 1.65 లక్షలు, ఎస్టీలు 90వేలమంది, ముస్లింలు 1.80 లక్షలు, జైన్‌లు 1.30 లక్షలు, కురుబ 1.70 లక్షలు, మరాఠాలు 1.70లక్షలమంది ఉన్నారు. నియోజకవర్గంలో 17,30,442 మంది ఓటర్లు కాగా 8,58,883మంది మహిళలు, 8,71,484మంది పురుషులు, 75మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారు.

● అణ్ణాసాహెబ్ జొల్లెకు సహకార రంగంలో అపారమైన అనుభవం ఉంది. ఐదేళ్లపాటు ఎంపీగా వ్యవహరించారు. భార్య శశికళ జొల్లె మాజీ మంత్రి కాగా ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. రమేశ్‌కత్తి వర్గీయులు సహకరించకపోవడం, కిందిస్థాయి కార్యకర్తలకు అందుబాటులో ఉండరనే విమర్శ ఈయనకు మైనస్‌గా చెప్పవచ్చు. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా చిక్కోడి ప్రాంతానికి మౌలిక సదుపాయాలు, రైల్వే ప్రాజెక్టులు తీసుకురావడంలో సఫలీకృతులు కాలేదనే విమర్శలు ఉన్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంక జార్కిహోళి ఎంబీఏ పట్టభద్రురాలు, యువ అభ్యర్థి, తండ్రి సతీశ్‌జార్కిహోళి రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన వ్యక్తి, గడిచిన శాసనసభ ఎన్నికల్లో తండ్రి తరపున ప్రచారం చేశారు. తొలిసారి ఎంపీ బరిలో దిగారు. తండ్రి మంత్రి కాగా కుటుంబానికి చెందిన రమేశ్ జార్కిహోళి, బాలచంద్ర జార్కిహోళిలు ఎమ్మెల్యేలు కాగా లఖన్ జార్కిహోళి ఎమ్మెల్సీగా ఉన్నారు. కుటుంబమంతా వివిధ కీలక హోదాల్లో ఉన్నారు. కుటుంబంలో ఇంతమంది క్రియాశీలక రాజకీయాల్లో ఉండగా రెండో తరం వారిని కూడా రంగంలోకి దించడం సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది. అయితే రాజకీయంగా అనుభవం లేకపోవడం ఈమెకు లోటుగా చెప్పవచ్చు.



ప్రియాంక జార్కిహోళి

తాగునీటి కోసం గ్రామస్థుల ధర్నా

బాగేపల్లి, ఏప్రిల్ 30: బాగేపల్లి హోబళి ఘంటంవారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పాత బాగేపల్లి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. మంగళవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్థులు చేరి తమ గోడు వెళ్లబోసుకున్నారు. గ్రామపంచాయతీ అధికారుల వైఫల్యాన్ని ఖండించారు. చుట్టుపక్కల చెరువులు, బావులు ఎండిపోయాయని గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. పశువులకు సైతం నీటి సమస్య ఉందన్నారు. సుమారు 20 రోజులుగా నీటి సమస్య ఎదుర్కొంటున్నామని వాపోయారు. వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఘంటంవారిపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి అరుణా కుమార, తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్‌లు ఇక్కడికి చేరుకుని వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు తమ నిరసన వీడారు. నిరసనలో గ్రామానికి చెందిన లక్ష్మి, గంగమ్మ, లక్ష్మీనరసమ్మ, హసిరుసేన తాలూకా అధ్యక్షుడు గోవింద రెడ్డి, గ్రామపంచాయతీ అధ్యక్షుడు నవీన్, గ్రామపంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఖాళీబిందెలతో నిరసన

పద్మావతి అమ్మవారి సేవలో కర్ణాటక హైకోర్టు సీజే

తిరుచానూరు, ఏప్రిల్ 30: కర్ణాటక రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్వీ అంజరియా కుటుంబ సమేతంగా మంగళవారం రాత్రి తిరుపతి జిల్లాలోని తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, అర్చకులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతించి దర్శన ఏర్పాట్లు చేశారు.

87ఏళ్ల వృద్ధుడికి అరుదైన చికిత్స

బెంగళూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గుండెనొప్పి, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న 87ఏళ్ల వృద్ధుడికి బన్నేరుఘట్టరోడ్డులోని ఫోర్టిస్ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. ఇంట్రావాస్కులర్ లిథోట్రిపి టెక్నాలజీ సాయంతో ఆపరేషన్ చేసినట్టు సీనియర్ కార్డియాలజిస్ట్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. గుండె నాళాల్లో పేరుకున్న కాల్షియం పొరలను తొలగించడం నాళాలకు గాయం కాకుండా చికిత్స చేశామన్నారు. 45 నిమిషాలపాటు శస్త్ర చికిత్స సాగిందని మూడు రోజుల్లోనే డిశ్చార్జ్ చేశామన్నారు. రక్తప్రసరణ ఇబ్బందిగా ఉండడంతో నాళాలు తెరిచేందుకు పీసీఐ విధానాన్ని ఉపయోగించామని, రక్తప్రసరణ సాధారణమైందన్నారు. ఒక స్టెంట్ గుండెనాళాల్లో అమర్చామన్నారు. ఆపరేషన్ విజయవంతంపై రోగితోపాటు బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

కేఎస్‌బీకి జాతీయస్థాయిలో అవార్డు

బెంగళూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పంప్ సెట్‌లు, వాల్వ్‌ల తయారీ కంపెనీ కేఎస్‌బీ లిమిటెడ్ 544 కోట్ల రూపాయల వృద్ధి సాధించిందని సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్‌కుమార్ ప్రకటించారు. 2023తో పోలిస్తే 11.2శాతం వృద్ధి సాధ్యమైందన్నారు. మంగళవారం ఈమేరకు నగరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. పీఎం కుసుమ్ 3 స్కీమ్ ద్వారా 63 కోట్లరూపాయలతో 2,500 సోలార్ వాటర్ పంప్‌సెట్లను పంపిణీ చేశామన్నారు. మహారాష్ట్ర ఎనర్జీ లిమిటెడ్ నుంచి ఉత్తమ బహుమతి అందిందన్నారు. సుప్రీం మోటర్ అండ్ పంప్ డ్రైవ్ అక్రెక్స్ 2024 పేరిట కొచ్చిలో జరిపిన 33వ జాతీయసదస్సులో ఈఎస్‌జీ చాంపియన్‌షిప్ దక్కిందన్నారు. బిల్డింగ్ సర్వీస్, ఇంజనీరింగ్ వాటర్ ట్రీట్‌మెంట్, వాటర్ ట్రాన్స్‌పోర్ట్ విభాగాలలో కేఎస్‌బీ గణనీయమైన ప్రగతి సాధిస్తోందన్నారు.

విశ్రాంత ఉద్యోగికి ఆత్మీయ వీడ్కోలు



రమేశ్ దంపతులకు సన్మానం

బంగారపేట, ఏప్రిల్ 30: పట్టణంలోని బీఈఓ కార్యాలయంలో మేనేజర్‌గా 33ఏళ్లపాటు సుదీర్ఘసేవలందించి రిటైరైన రమేశ్‌ను ఆత్మీయంగా సత్కరించి వీడ్కోలు పలికారు. మంగళవారం ఏర్పాటైన కార్యక్రమంలో బీఈఓ డీఎన్ సుకన్య మాట్లాడుతూ క్రమశిక్షణ, దక్షత, ప్రామాణికతతో విధులు నిర్వహించారని ఆయన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఎప్పుడూ ఆలస్యంగా వచ్చేవారు కాదన్నారు. విద్యార్థులు, ప్రజలతో ఓర్పుతో వ్యవహరించేవారన్నారు. ఆయన విశ్రాంత జీవనం ఆరోగ్యంగా చక్కగా సాగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు సంఘం అధ్యక్షుడు ఎంఆర్ ఆంజనేయగౌడ మాట్లాడుతూ ఎవరినీ నొప్పించకుండా వ్యవహరించేవారన్నారు. కార్యాలయ అధికారి దేవరాజు, ఎయిడెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్ అశ్వథ్, ఈసీఓలు లీలా, వెంకటరమణప్ప, హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్‌ల సంఘం అధ్యక్షుడు ఎల్ రాజప్ప తదితరులు మాట్లాడుతూ సౌమ్య స్వభావం కల్గి శాంతంగా విధులు నిర్వహించేవారన్నారు. ఆయన సేవ మాకు మార్గదర్శకమన్నారు. ఈ సందర్భంగా బీఈఓ కార్యాలయం, ఉపాధ్యాయుల సంఘం, ఎయిడెడ్ ఉద్యోగుల సంఘం, ఉద్యోగుల సంఘం వివిధ సంస్థలు రమేశ్ దంపతులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సమన్వయాధికారి ఎంకే శశికళ, ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి శ్యామమూర్తి, ఉపాధ్యక్షుడు నారాయణస్వామి, కోశాధికారి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టీచర్‌కు వీడ్కోలు

పట్టణంలోని పీయూసీ కళాశాలలోని హైస్కూల్ విభాగంలో సైన్స్ టీచర్ ఖాదార్ బాష 39ఏళ్లపాటు సేవలందించి మంగళవారం రిటైరయ్యారు. ఈ సందర్భంగా వీడ్కోలు సభ నిర్వహించి ఆత్మీయంగా సత్కరించారు. ఉపాధ్యాయుడిగా, బీఆర్‌సీగా ఉత్తమ సేవలందించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎన్ నాగరాజ్ మాట్లాడుతూ విద్యారంగంలో ఆయన సేవలు గొప్పవన్నారు. ఆయన విశ్రాంత జీవనం సుఖమయంగా సాగాలని కోరారు. హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్‌ల సంఘం అధ్యక్షుడు రాజప్ప తదితరులు పాల్గొన్నారు.



కూలిన స్తంభం ఇదే...

కుప్పకూలిన విద్యుత్‌స్తంభం

శిడ్లఘట్ట, ఏప్రిల్ 30: పట్టణంలోని 21వ వార్డు కామాట్కర వీధిలో దుస్థితిలో ఉన్న విద్యుత్‌స్తంభం మంగళవారం ఉదయం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ వేళలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్టయ్యింది. దుస్థితిలో ఉన్న స్తంభం గురించి ఇప్పటికే బెస్కాం అధికారులను కోరినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. పూర్తిగా కూలిపోవడంతో సమాచారం అందుకున్న అధికారులు స్పందించారు. వెంటనే విద్యుత్ సరఫరాను ఆపేశారు. తాత్కాలికంగా సమీపం లోని స్తంభం నుంచి ఇళ్లకు కనెక్షన్‌లు సమకూర్చి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

ఆక్రమణలను అడ్డుకోండి

శిడ్లఘట్ట, ఏప్రిల్ 30: తాలూకాలోని హనుమంతపుర వద్ద సర్వే 10లో 31 గుంటల స్థలాన్ని క్రీడా మైదానంకోసం కేటాయించారు. అయితే కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించారని రెండు నెలలక్రితం క్రీడాశాఖ అధికారుల దృష్టికి తెచ్చినా ప్రయోజనం లేకపోయిందని రాష్ట్ర యువజన సంఘ సంస్థల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు జయంతి గ్రామ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ క్రీడామైదానాలను రక్షించడంలోనూ అధికారులు నిర్లక్ష్యం చేస్తే ఎలాగని ప్రశ్నించారు. ఆస్తులను కాపాడాల్సిన స్థానిక అధికారులు ఇలా ఆక్రమణదారులకు కుమ్మక్కు ఇస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఆస్తులను కాపాడాలన్నారు.

రాజస్థాన్ ఐపీఎస్ అధికారికి సన్మానం



ఐపీఎస్ అధికారి దినేశ్‌కు సన్మానం

చింతామణి, ఏప్రిల్ 30: చింతామణి తాలూకా మునుగన హళ్ళి గ్రామానికి చెందిన దినేశ్ 1995 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం రాజస్థాన్‌లో అవినీతి నిరోధక శాఖలో అడీజీపీగా సేవలందిస్తున్నారు. తాలూకాలోని మాడికెరె గ్రామంలోని ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వగ్రామానికి రావడంతో దినేశ్, ఆయన భార్య విజయలక్ష్మి, దినేశ్ తండ్రి నారా యణ స్వామిలను సంప్రదాయ మైసూరు తల పాగా, శాలువాతో ఆత్మీయంగా సత్కరించారు. కాగా రాజ స్థాన్‌లో ఎన్‌కౌంటర్ దినేశ్‌గా చిరపరిచితులు. ఆయన పలు అక్రమ కేసులలో సీనియర్ అధికారులను సైతం లెక్క చేయకుండా అరెస్టు చేశారు. రౌడీలు, క్రిమినల్స్, భూ మాఫి యాపై కఠిన చర్యలు చేపట్టి ఉత్తమ అధికారిగా పేరొం దారు. ప్రస్తుతం గ్రామంలో మునగనహళ్ళి గ్రామానికి చెందిన హైస్కూల్ టీచర్ రమేశ్, గ్రామ ప్రముఖులు ముని వెంకటరెడ్డి, అంగడి నాగణ్ణ, చంద్రశేఖర, కెంపరెడ్డి, ముని ఆంజప్ప, డెయిరీ మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎం ఎస్ శ్రీనివాస, ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యా యుడు ఎంవీ యదేవ్, ఉపాధ్యాయులు పుష్పలత, జే లావణ్య, ఆం జనేయరెడ్డి, ఎంకేఎల్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టును ఢీకొన్న కారు

» కర్ణాటకవాసి దుర్మరణం, నలుగురికి గాయాలు



కల్వర్టును ఢీ కొన్నకారు

చంద్రగిరి, ఏప్రిల్ 30: కల్వర్టును కారు ఢీకొన్న ప్రమాదంలో కర్ణాటక వాసి ఒకరు దుర్మరణం చెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు చెందిన మురళీధర్, అమర్, ఉమా, అనుషా, సుశీలమ్మ ఆదివారం కారులో తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చారు. స్వామివారిని దర్శించుకుని సోమవారం రాత్రి సొంతూరుకు కారులో బయల్దేరారు. మార్గమధ్యంలో పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై అర్ధరాత్రి ఒంటి సమయంలో తిరుపతి జిల్లాలోని చంద్రగిరి మండలం ముంగిలిపట్టు వద్ద ఉన్న కల్వర్టును కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుశీలమ్మ(55) అక్కడికక్కడే మృతి చెందారు. వాహనంలోని మిగిలిన నలుగురికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను 108 వాహనంలో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సుశీలమ్మ మృతదేహం

అచ్చు..తప్పు..!

● మోదీ మరోసారి ప్రధానిగా గెలవాలి
● పెళ్లిపత్రికలో ప్రచురించిన అభిమాని
● ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడిపై కేసు

బెంగళూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పెళ్లి పత్రికలో ఓ వీరాభిమాని మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గెలవాలని ప్రచురించడం వివాదానికి దారి తీసింది. దక్షిణ కన్నడ జిల్లా ఉప్పినంగడికి చెందిన శివప్రసాద్ పెళ్లిపత్రికలను పరిశీలించిన ఎన్నికల అధికారుల సూచన మేరకు ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. ఏప్రిల్ 18న శివకుమార్ పెళ్లి జరిగింది. మార్చి 1న పెళ్లిపత్రికలు ముద్రించారు.



ఇందులో మరోసారి నరేంద్రమోదీ గెలవాలంటూ ముద్రించారు. ఏప్రిల్ 14న ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగిందని అధికారులు వరుడు శివప్రసాద్ ఇంటికెళ్లి విచారణ జరిపారు. ఇది కోడ్ ఉల్లంఘన కాదని మోదీ పట్ల అభిమానం, దేశం పట్ల ఆసక్తితో తన పెళ్లిపత్రికలో వేయించుకున్నానని లిఖితపూర్వకంగా విన్నవించారు. అధికారులు పెళ్లి కొడుకును క్షమించి వదిలేశారు. అయితే పత్రిక ముద్రించిన ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడిపై కేసు నమో దు చేశారు. పెళ్లికొడుకు ఉపశమనం పొందగా ప్రింటింగ్ ప్రెస్ యజమాని కేసులో ఇరుక్కున్నారు పాపం అని పలువురు చర్చించుకుంటున్నారు.

అధికార లాంఛనాలతో శ్రీనివాసప్రసాద్ అంత్యక్రియలు

బెంగళూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కన్నుమూసిన బీజేపీ ఎంపీ శ్రీనివాసప్రసాద్ అంత్యక్రియలు మంగళవారం అధికార లాంఛనాలతో జరిపారు. మైసూరులోని అశోకపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ట్రస్టు ఆవరణలో బౌద్ధ ధర్మ విధి విధానాలకు అనుగుణంగా ఖర్మకాండలు నిర్వహిం చారు. పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మైసూరు ఎంపీ ప్రతాప్‌సింహ మాట్లాడుతూ రాజకీయంగా ఎదుగుదలకు ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం ప్రభుత్వ లాంచనాలు ముగిశాయి. బెంగళూరులోని మహాబోధి సొసైటీకి అనుబంధమైన ఆనంద్‌బంతేజి, మైసూరు విశ్వమైత్రి బుద్ధవిహార్ కల్యాణ సిరి బంతేజిల నేతృత్వంలో 15మంది బౌద్ధభిక్షువులు ప్రార్థనలు చేశారు. బౌద్ధ బంతేజిలకు వస్త్రదానం, పండ్లు సమర్పించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప, బెంగళూరు గ్రామీణ బీజేపీ అభ్యర్థి డాక్టర్ సీఎన్ మంజునాథ్, మైసూరు కొడగు ఎంపీ అభ్యర్థి యదువీర్ పాల్గొన్నారు.




స్పెయిన్ యువకుడితో మండ్య యువతి వివాహం

బెంగళూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రేమకు హద్దులు లేవని ఓ జంట మరోసారి రుజువు చేసింది. కర్ణాటక రాష్ట్రం మండ్యకు చెందిన యువతి, స్పెయిన్ దేశానికి యువకుడు హిందూ సంప్రదాయబద్ధంగా వివాహం చేసుకున్నారు. మండ్య జిల్లా కేఆర్ పేట పట్టణం శమంత్ టెక్స్‌టైల్స్ యజమాని రవీంద్రనాథ్ కుమార్తె దీక్షిత కోయంబత్తూరులోని ఇషా ఫౌండేషన్‌లో యోగా శిక్షకురాలిగా వ్యవహరిస్తున్నారు. స్పెయిన్‌లోని బార్సిలోనా నగరానికి చెందిన జాన్ వైడల్‌తో కొంతకాలం కిందట దీక్షితతో స్నేహం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారింది. ఇషా ఫౌండేషన్ ముఖ్యులు జగ్గీ వాసుదేవ్ ద్వారా రెండు కుటుంబాలు చర్చలు జరిపి వివాహానికి అంగీకరించాయి. కేఆర్ పేటలోని నంజమ్మ ముద్దేగౌడ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం దీక్షిత, జాన్ వైడల్ వివాహం జరిగింది. పెళ్లికి స్పెయిన్ నుంచి జాన్ వైడల్ తల్లిదండ్రులతోపాటు అన్నాచెల్లెళ్లు హాజరయ్యారు. దీక్షిత తండ్రి రవీంద్రనాథ్ మాట్లాడుతూ జాన్‌వైడల్ క్రమశిక్షణ కల్గిన యువకుడని, తన కుమార్తెకు తాను వెతికినా ఇంత మంచి సంబంధం దొరికేది కాదని అన్నారు. వివాహం ఎలా రాసి పెట్టి ఉంటే అలా జరుగుతుందని అన్నారు. ఇషా ఫౌండేషన్‌కు జాన్‌వైడల్ యోగా నేర్చుకునేందుకు వచ్చి భారతీయురాలిని పెళ్లి చేసుకున్నారని వైడల్ తల్లిదండ్రులు తెలిపారు. దీక్షిత మాట్లాడుతూ స్పానిష్ భాష నేర్చుకుంటున్నానని, తమ మధ్య సామరస్యం, ప్రేమ ఉన్నాయని, ఇద్దరం కలసి జీవనం సాగిస్తామని తెలిపారు.



వధూవరులు దీక్షిత, జాన్‌వైడల్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.36	1,576.13
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	169	258
సామర్థ్యం (టీఎంసీలు)	3.73	2.87

ఓటుపై అవగాహన కోసం మహిళా క్రికెట్ టోర్నమెంట్



మహిళా క్రికెట్ టోర్నమెంట్ దృశ్యం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 30: నగరంలోని కోటే ప్రాంతంలోని సంత్‌జోషఫ్ కళాశాల మైదానంలో మంగళవారం మహిళా క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఓటర్లకు ఓటింగ్‌పై అవగాహన పెంపొందించేలా టోర్నీని తాలూకా స్వీప్ నోడల్ అధికారి, తాలూకాపంచాయితీ ఈఓ మాదగిన బసప్ప ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ లాంటివని, ఓటర్లు తప్పనిసరిగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ తక్కువగా ఉంది కాబట్టి క్రికెట్ ఆడుతూ వినూత్నంగా ఓటు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పంచాయితీ రాజ్ అసిస్టెంట్ డైరెక్టర్ మహ్మద్ గౌస్ మాట్లాడుతూ క్రీడాకారులందరూ తప్పకుండా ఓటు వేయాలని , తమ చుట్టూ ఉన్న ఓటర్లందరూ ఎన్నికల్లో పాల్గొని ఓటు వేసేలా ప్రొత్సహించాలన్నారు. ఈ సందర్భంగా టీపీపీ అసిస్టెంట్ అకౌంటెంట్ శరణప్ప, టీపీపీ మేనేజర్ బచ్చలప్ప, బళ్లారి తాలూకాలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ పాల్గొన్నారు. మహిళా క్రికెట్ టోర్నమెంట్‌లో వివిధ పంచాయితీలకు చెందిన మహిళా క్రీడాకారులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

మూడు ఎక్సైజ్ కేసుల నమోదు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 30: లోక్ సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి నేపథ్యంలో అక్రమ మద్యం రవాణాకు సంబంధించి మంగళవారం మూడు కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ మంజునాథ్ తెలిపారు. బళ్లారి సెంట్రల్ బస్టాండ్ సమీపంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరం ముందు ద్విచక్ర వాహనంలో 8.6 లీటర్ల మద్యం తీసుకెళుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని మద్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. సిరుగుప్ప నగరంలోని మహాత్మగాంధీ సర్కిల్ వద్ద ద్విచక్రవాహనంలో 15.6 లీటర్ల బీరు తీసుకెళుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొన్నామన్నారు. అలాగే హొస్పేట్ రోడ్డులో ద్విచక్ర వాహనంలో 4.3 లీటర మద్యాన్ని తీసుకెళుతున్న వ్యక్తిని గుర్తించి వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన ప్రకటనలో తెలిపారు.

పోలింగ్ సిబ్బందికి మే 1నుంచి ఓటింగ్‌కు అనుమతి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 20: బళ్లారి లోక్‌సభ ఎన్నికల విధుల్లో నిమగ్నమైన అధికారులు, సిబ్బందికి మే 1నుంచి 6వ తేది వరకు ఓటింగ్‌కు అనుమతించామని జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. ఇందు కోసం సిటీ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని గాంధీభవన్‌లో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ రోజున ఎన్నికల విధుల్లో నిమగ్నమైన పోలీసు, ఆరోగ్య శాఖ అధికారులు, క్లీనింగ్ పని వారు, డిపార్ట్‌మెంటల్ వాహనాల డ్రైవర్లు ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో పాటు అధికారులు, సిబ్బంది ఓటు వేసేందుకు అనుమతి ఉంటుందన్నారు. ప్రతి ఓటు విలువైనదని, పోలింగ్ రోజున ఎన్నికల విధుల్లో నిమగ్నమైన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన ప్రత్యేక విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నిర్భయంగా ఓటు వేయండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాకారులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 30: అందరూ నిర్భయంగా ఓటు వేయాలని బయలాట కళాకారిణి చాముండి అన్నారు. నగరంలోని గుగ్గరహట్టి వీరాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హాలికుంటరాయ తోలుబొమ్మలాట కళాబృందం ఆధ్వర్యంలో ఎన్నికల జాగరణ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కళాకారిణి చాముండి మాట్లాడుతూ బయలాట కంటే కష్టతరమైన కళ తోలుబొమ్మలాటను కాపాడుకుంటూ రావడంసాహసమేనన్నారు.



పోటీనుంచి మాయమైన మగువలు

- బళ్లారి లోక్‌సభా నియోజకవర్గంలో రంగంలో కనిపించని మహిళా నేతలు
- గతంలో బసవరాజేశ్వరి, సోనియాగాంధీ, సుష్మాస్వరాజ్ లాంటి వారి ప్రాతినిధ్యం

బళ్లారి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రం అయిన కర్ణాటకలో బళ్లారి రాజకీయాలకు ఒక ప్రత్యేకత ఉంది. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, బీజేపీ అగ్రనాయకురాలు దివంగత సుష్మస్వరాజ్, అంతకు ముందు బసవరాజేశ్వరి, వీరితో పాటు శ్రీరాములు సోదరి జే శాంత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఘనవిజయం సాధించారు. ఇలాంటి వనితలు పోటీ చేసిన క్షేత్రంలో ఈసారి మచ్చుకైనా ఒక్క మహిళ కూడా పోటీలో లేకపోవడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. 1952 నుండి 2019 వరకూ బళ్లారి లోక్‌సభకు మొత్తం 19 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో రెండు ఉప ఎన్నికలు జరిగాయి. అయితే మహిళలు ఎన్నికల్లో పోటీ చేయలేదు, 1984లో కాంగ్రెస్ నుండి పోటీ చేసిన బసవరాజేశ్వరి ఆమే అప్పటికి తొలిమహిళ గా పోటీ చేసి గెలిచి బళ్లారి లో మహిళ చరిత్రను నిలిపింది, 1984, 1989, 1991 లో జరిగిన ఎన్నికల్లో బసవరాజేశ్వరి గెలుపొందింది.

1999లో కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ, బీజేపీ నుండి సుష్మస్వరాజ్ పోటీ లో ఉండడం దేశ రాజకీయాలన్నీ బళ్లారి వైపు చూశాయి. అయితే అ ఎన్నికల్లో బళ్లారి ప్రజలు సోనియాను ఆదరించారు. 2004లో గౌసియా బేగం అనే మహిళ పార్టీయేతర అభ్యర్థినిగా పోటీలో నిలిచారు. 2009లో జరిగిన ఉప ఎన్నికల్లో జే. శాంత పోటీ చేసి విజయం సాధించారు. 2019 లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నూ ఒక్క మహిళ కూడా పోటీ చేయలేదు. 2024 లోక్‌సభ ఎన్నికలు కూడా ఏ ఒక్క మహిళ కూడా పోటీలో నిలవలేదు.

బళ్లారి లోక్‌సభ పరిధిలో సుమారు 18లక్షలా 60వేల పైచిలు ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 9లక్షలా పై చిలుక మంది ఉన్నారు. ఓటర్ల లెక్కల ప్రకారం పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువ.

కానీ ఈ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు కూడా మహిళలకు టికెట్లు ఇవ్వలేదు, అలాగే ఇతర రాజకీయ పార్టీలూ మహిళలను పోటీలో నిలపలేదు, ఇక ఎవరూ ఇండిపెండెంట్లుగా కూడా పోటీ లో లేక పోవడం ఇది బళ్లారి ప్రత్యేకత.

ఆహారం కోసం రోడ్డెక్కిన రామసాగర వానరాలు

కంప్లి, ఏప్రిల్ 30 : ఎండలు అధికం కావడంతో అడవులు కూడా పూర్తిగా ఎండిపోతున్నాయి. వర్షాభావం కారణంగా ఈ యేడాది మనుషులతో పాటు మూగజీవాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వన్యప్రాణులు ఆహారం దొరకక గ్రామాల్లోకి ప్రవేశిస్తున్నాయి. రామసాగర సమీపంలోని పంపాపతి విద్యాపీఠం వద్ద అడవి గతంలో పచ్చదనంతో, నీటితో కళకళలాడుతూవుండేది. ఈ యేడాది అక్కడ అడవి పూర్తిగా ఎండిపోయింది. అక్కడ చెట్లను ఆశ్రయించుకుని బతికే వానరాలు రోడ్లపైకి ఆహారం కోసం వస్తున్నాయి. ఆ దోవనపోతున్న మనుషుల వద్ద ఆహారం కోసం చేయిచాస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా రోడ్డుకెక్కుతున్నాయి. ద్విచక్రవాహనదారులు, పెద్ద పెద్ద వాహనదారులు వాటికి బిస్కెట్లు, అరటిపండ్లు అందిస్తూ తమ దయాగుణం చూపుతున్నారు. ఇప్పటికైనా వన్యప్రాణి అధికారులు వీటిని దృష్టిలో వుంచుకుని అడవిని కాపాడాల్సి ఉంది.



రామసాగర పంపాపతి విద్యాపీఠం వద్ద ఆహారం కోసం రోడ్డెక్కిన కోతులు

కాంగ్రెస్ గ్యారెంటీలను నమ్మి మోసపోవద్దు

సిరుగుప్ప, ఏప్రిల్ 30 : కాంగ్రెస్ గ్యారెంటీలను నమ్మి మోసపోవద్దని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రవి కోరారు. సిరుగుప్ప పట్టణం వైష్ణవి హాలులో మంగళవారం బీజేపీ అభ్యర్థి డాక్టర్ బసవరాజు తరఫున ప్రచార సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే మరో 25 యేళ్లలో భారతదేశం నెంబర్ వన్‌గా మారుతుందన్నారు. కాంగ్రెస్ పరిపాలనలో భారతదేశం ఆర్థికంగా వెనుకబడి వుండేదని, బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముందడుగు వేసిందన్నారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే మరో రెండు స్థానాలను అధిగమించి మూడవ స్థానానికి రావడంలో ఎలాంటి అనుమానం లేదన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రజలకు గ్యారెంటీల పేరుతో రాజకీయం చేస్తున్నారని అవి శాశ్వతం కాదన్నారు. మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప మాట్లాడుతూ ఈ సారి బసవరాజుకుసిరుగుప్ప నియోజకవర్గం నుంచి పది వేల ఓట్ల మెజార్టీ అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ దేశ ప్రధాని చేసిన పనులను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షులు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి, సీనియర్ నాయకులు ధరప్పనాయక, నాంచారయ్య, నాగరాజ, బెళగల్ బసవరాజు, మైకేల్ వీరేష, మహదేవ, రంగప్ప, బీఎన్ కుమార్, గంగాధర, విక్రమ్ జైన్, యువనాయకులు, కార్యకర్తలు, మహిళా అధ్యక్షురాలు మహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న బీజేపీ నేతలు

గాలిలో వేలాడుతూ మత్స్యకారుల ఆపద మొక్కులు



కాళమ్మ దేవికి ప్రత్యేక పూజలు

కంప్లి, ఏప్రిల్ 30 : కంప్లి తుంగభద్ర నది ఒడ్డున కంప్లికోటలో నివసిస్తున్న మత్స్యకారులు కాళమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత రెండు మూడు రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అగ్నిగుండం, హోమాలు కూడా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మత్స్యకారులు వీపు చర్మానికి కొక్కాలను వేసుకుని కాళమ్మ దేవాలయం నుంచి సుంకులమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. ప్రతి యేటా ఈ విధంగా పూజలు చేపట్టి మొక్కులు సమర్పించుకుంటామని మత్స్యకారుల సంఘం అధ్యక్షులు చిన్నరాజప్ప తెలిపారు. అమ్మవారికి పూజలు చేపడితే సంవత్సరం పాటు ఆరోగ్యంగా వుంటూ ఉంటామన్నది తమ నమ్మకమన్నారు. కొందరు వీపులకు కొక్కాలను వేసుకోవడంతో పాటు నాలుకపై కొక్కాలను వేసుకుని కారు, చిన్న చిన్న బండరాళ్లను లాగారు. మండుటెండను కూడా లెక్క చేయకుండా పూజలు నిర్వహించారు. కంప్లి కోటెతో పాటు గంగావతి, హోస్పేట, సింధనూరు, బళ్లారి, వివిధ గ్రామాల మత్స్యకారులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించుకుని మొక్కులు సమర్పించుకున్నారు.



వీపుకు కొక్కాలను వేసుకుని మొక్కుచెల్లిస్తున్న మత్స్యకారులు

భగ్గుమన్న గంగావతి

- కాంగ్రెస్ నాయకుల అసమ్మతి సెగలు..
- ముఖ్యమంత్రి ఎదుటే... వాదోపవాదాలు
- తన ఓటమికి స్థానిక కాంగ్రెస్ నేతలే కారణమని ఇక్బాల్ అన్సారి ఆరోపణ..



వేదికపై మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఇక్బాల్ అన్సారి...

బళ్ళారి గాంధీనగర్, ఏప్రిల్ 30: గంగావతికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య ద్వేషాలు మరోసారి భగ్గుమన్నాయి... ఏకంగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఎదుటే కాంగ్రెస్ సీనియర్ నాయకులపై ఆరోపణలు చేయడం సిద్దరామయ్య తలదించుకునే పరిస్థితిని నెలకొంది. కొప్పళ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పరంగా మంగళవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రచార కర్యక్రమంలో భాగంగా గంగావతి పట్టణంలో సాయంత్రం బహిరంగ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఇక్బాల్ అన్సారి ప్రసంగిస్తునే... గతంలో జరిగిన శాసనసభ ఎన్నికల ఫలితాల తరువాత పార్టీ నేతల మధ్య నెలకొన్న అసమ్మతి వర్గం ముఖ్యమంత్రి ముందు తెరపైకి తీసుకురావడంతో కొద్దిసేపు సమావేశంలో గందరగోళం నెలకొంది. గత ఎన్నికల తన ఓటమికి కాంగ్రెస్ పార్టీలో ఉన్న డీలర్లే కారణమంటూ అన్సారి నేరుగా ఆరోపించారు. పార్టీలో సీనియర్ నాయకులుగా చెప్పుకుంటున్న మాజీ మంత్రి మల్లికార్జున నాగప్ప, విధాన పరిషత్ సభ్యులు హెచ్.ఆర్. శ్రీనాథ్, గంగావతి బ్లాక్ కాంగ్రెస్ విభాగం అధ్యక్షులు మనియార్, జనార్దన్ రెడ్డితో చేతులు కలిపి తనను ఓడించారని ఆరోపించారు. లోకసభ ఎన్నికల ప్రారంభం నుండి గంగవతి పట్టణంలో కాంగ్రెస్ నాయకుల మధ్య నెలకొన్న విబేధాలు మరో భగ్గుమన్నాయనడానికి వేదికపై ఇక్బాల్ అన్సారి చేసిన వ్యాఖ్యలతో నిజమయ్యాయి. గంగావతి తాలూకా క్రీడామైదానంలో ఏర్పాటు ఎన్నికల ప్రచార సభలో అన్సారి వేదికపైకి ముఖ్య అతిధులను ఆహ్వానించాలని మంత్రి శివరాజ్ తంగడిగి ఇక్బాల్ అన్సారిని కోరారు. అయితే ఇక్బాల్ అన్సారి మాత్రం మల్లికార్జున నాగప్ప, హెచ్.ఆర్.శ్రీనాథ్, షామీద్ పేర్లు పిలవలేదు... స్వాగతం పలకలేదు. పరిస్థితిని గమనించిన మంత్రి శివరాజ్ తంగడిగి తానే స్వయంగా మైక్ దగ్గరుకు చేరుకుని మల్లికార్జున నాగప్ప, హెచ్.ఆర్.శ్రీనాథ్, శామిదల్‌ను స్వాగతించారు.

బళ్లారి కర్ణాటక వన్‌లో దోపిడీ

- రూ. 75 లక్షల నగదు దోచుకుపోయిన దుండగులు

బళ్లారి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగర పాలికే కార్పొరేషన్ భవనంలోని కర్ణాటక వన్ సెంటర్‌లో చోరీ జరిగింది. దుండగలు రూ. 75 లక్షలు దోచుకెళ్లారు. గాంధీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గాంధీనగర్‌లోని కర్ణాటక వన్ సబ్ సెంటర్, వివిద రకాల పన్నులు. అలాగే లావాదేవీలు చేశారు. ఇందలో మొత్తం రూ. 93.53.795 వసూలు అయింది. అయితే ఈ మొత్తం ను ఏరోజుకా రోజు బ్యాంకులో జమా చేయాలి, బ్యాంకుకు శని, ఆది వారాలు సెలవు రావడంతో ఆ మొత్తం బ్యాంకు ఖాతాలో జమాచేయలేదు, కార్పొరేషన్ భవనంలోని కేంద్ర కార్యాలయంలోని సేఫ్టీ లాకర్‌లో భద్రపరిచినట్లు కర్ణాటక వన్ నిర్వహకులు పోలీసులకు తెలిపారు. కేంద్ర కార్యాలయంలో నగదు ఉంచిన లాకర్ తాకాలు పగల కొట్టి దుండగలు రూ. 75 లక్షల నగదును దోచుకుపోయారు. ఇది కార్యాలయంలో పనిచేసే వారి పనే అని పోలీసులు అనుమానిస్తున్నారు. కార్యాలయంలో ఉండే సీసీ కెమెకరాలు, డీవీఆర్ చోరీకి గురయిందని కర్ణాటక వన్ ప్రాజెక్టు మేనేజర్ ఉయం అర్కపాలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైభవంగా నారద రథోత్సవం

కంప్లి, ఏప్రిల్ 30 : దేశంలో నారదముని ఆలయాల సంఖ్య చాలా తక్కువ. విజయనగర జిల్లా హరప్పనహళ్లి తాలుకా తిగటేరి గ్రామంలో నారదముని ఆలయం వుంది. అక్కడ మంగళవారం స్వామివారి రథోత్సవాన్ని వేలాది మంది భక్తుల నడుమ నిర్వహించారు. ఉదయం నారదమునికి ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం 5 గంటలకు భజనలు, కోలాటాలు, వివిధ వేషధారణలు, తోలు బొమ్మలు, కళాకారుల నడుమ ఈ రథోత్సవం జరిగింది. నారదముని భక్తాదులు వివిధ రాష్ట్రాల నుండి తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.



నారదముని స్వామి రథోత్సవ దృశ్యం

హోసూరు జోన్

పిల్లల ఆసుపత్రికి ఉత్తుత్తి బాంబు బెదరింపు



బాంబు నిష్క్రియాదళం తనిఖీలు

హోసూరు ఏప్రిల్ 30: హోసూరు అరసనట్టి ప్రాంతానికి చెందిన వైద్యుడు నవీన్‌కుమార్ స్థానిక దర్గా మారుతీనగర్ ప్రాంతంలో ఓ ప్రైవేట్ పిల్లల ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. డీఎంకేలో కృష్ణగిరి పశ్చిమ జిల్లా వైద్య బృందం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఆయన భార్య శ్రీలక్ష్మి కూడా అదే ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం 10.18 గంటలకు ఓ గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఆసుపత్రి మెయిల్‌కు బాంబు బెదరింపు వచ్చింది. ఆస్పత్రిలో పెద్దఎత్తున పేలుడు పదార్థాలు ఉన్నట్టు పేర్కొన్నాడు. దాదాపు 12 గంటలకు మెయిల్ సందేశాన్ని గుర్తించిన ఆసుపత్రి సిబ్బంది వెంటనే యజమాని నవీన్‌కుమార్‌కు సమాచారం అందింది. మరోవైపు ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్‌లను వెంటనే ఆస్పత్రి నుంచి తరలించారు. అక్కడ పనిచేస్తున్న వైద్యులు సిబ్బంది కూడా వెళ్లి పోయారు. నవీన్‌కుమార్ వెంటనే హోసూరు సిప్‌కాట్ పోలీసులకు సమాచారం అందించారు. ఆసుపత్రికి బాంబు నిష్క్రియాదళం చేరుకుని పరిశీలన చేసింది. కృష్ణగిరి నుంచి వచ్చిన స్నిఫర్ డాగ్ రోజి సాయంతో ఆసుపత్రిలోని మూడు అంతస్తులలోని 30 గదులు, జనరేటర్ ప్రాంతం, కారిడార్ తదితర చోట్లా క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. ఆస్పత్రిలో ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. ఉత్తుత్తిబాంబు బెదరింపుగా తేలింది. ఎట్టకేలకు ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని తేలడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఇలా ఒకే ఇమెయిల్ ద్వారా చెన్నైలోని ఓ చిన్నపిల్లల ఆసుపత్రికి దేశ వ్యాప్తంగా 64 ఆసుపత్రులకు బాంబు బెదరింపు మెయిల్ వచ్చినట్టు తెలుస్తోంది. పోలీసులు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి దర్యాప్తు చేపట్టారు.

భూసార పరీక్షలపై అవగాహనా శిబిరం

హోసూరు, ఏప్రిల్ 30: ఏదైనా ఒక పంట దిగుబడి బాగా ఉండాలంటే అక్కడి మట్టిసారం ఆధారంగానే సాధ్యమవుతుంది. ఈ దిశలో భూసార పరీక్షల ఆవశ్యకతను వివరిస్తూ వ్యవసాయ శాఖ కార్యాచరణ చేపట్టింది. హోసూరు పరిధిలోని 87 రెవెన్యూ గ్రామాలలో ఒక గ్రామం ఒకే పంట పథకం అమలుకు సంబంధించి హోసూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఏ భువనేశ్వరీ నేతృత్వంలో అవగాహన చర్యలు చేపట్టారు. హోసూరు పరిధిలో 8వేల హెక్టార్లలో పలు రకాల పంటలు సాగు చేస్తున్నారు. వరి, రాగి, వేరుశెనగ తదితర రకాలు ప్రధానంగా ఉన్నాయి. ప్రస్తుత 2024-25 సంవత్సరంలో వ్యవసాయ అధికారి డిప్యూటీ అగ్రికల్చర్ ఆఫీసర్, అసిస్టెంట్ వ్యవసాయ అధికారుల ద్వారా 87 రెవెన్యూ గ్రామాల్లో ఏ పంట ఎక్కువగా సాగు చేస్తున్నారో గుర్తించి ఈ పథకం క్రింద వివిధ సాంకేతికతలపై సాంకేతికతలపై శిక్షణ ఇస్తారు. ప్రత్యేకించి ఒక్కో రెవెన్యూ గ్రామంలో 5-10 ఎకరాల భూమిని ఎంపిక చేసి రైతులందరికీ ఒకే రకమైన పంటను సాగు చేయాలని సూచించారు. విత్తడం నుంచి కోత కోయడం వరకు, భూమిని చదును చేయడం, భూసార పరీక్ష, పంటకు అనువైనది, విత్తనశుద్ధి, కలుపు తీయడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. సాంకేతికతలను కూడా అమలు చేయనున్నారు. ఈ పథకం ద్వారా దిగుబడిని 15 నుంచి 20 శాతం పెంచడమే వ్యవసాయ శాఖ అధికారుల లక్ష్యం. పునగన్‌దొడ్డి గ్రామంలో మంగళవారం 25 మంది రైతులకు ఒక గ్రామం ఒక పంట ప్రాజెక్టు గురించి అవగాహన శిబిరం నిర్వహించారు.



రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

ప్రచారంలో బీజేపీ-కాంగ్రెస్ శ్రేణుల వాగ్వాదం..!



శ్రేణులను సముదాయించే ప్రయత్నం చేస్తున్న ఎమ్మెల్యే డా.శివరాజ్ పాటీల్

రాయచూరు, ఏప్రిల్ 30 : లోకసభ ఎన్నికల ప్రచారం జోరందుకున్న వేళ రెండు ప్రధాన పార్టీల మధ్య గర్షణ వాతావరణం నెలకొంది. రాయచూరు స్థానం నుంచి కాంగ్రెస్-బీజేపీలు ముఖాముఖి తలపడుతున్న పరిస్థితి నెలకొనడంతో రెండు పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య ఘర్షపు వాతావరణం నెలకొంది. మంగళవారం నగరంలోని దేవర కాలనీ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సందర్భంగా ఇరు పార్టీల కార్యకర్తలు వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ దశలో అక్కడికి చేరుకున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి బోసరాజు కుమారుడు రవి బోసరాజు, ఆ పార్టీ నాయకులను, కార్యకర్తలను శాంతిపచేసే ప్రయత్నం చేశారు. అదే సమయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు, సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్ తమ శ్రేణులను సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే ఇరు వర్గాల వారు మరింత రెచ్చిపోయి వాగ్వాదానికి దిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో అక్కడికి చేరుకున్న పోలీసులు ఇరు వర్గాలను శాంతిప చేసి రప్పించి వేశారు.

ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు

రాయచూరు, ఏప్రిల్ 30 : లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజస్థాన్‌లోని బన్స్వాడాలో ప్రదాన మంత్రి చేసిన వ్యాఖ్యలకు ముస్లిం సంఘాల ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మత విద్వేషపు ప్రసంగం చేసిన నరేంద్ర మోదీ పై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాధికారి కార్యాలయంలో ఈమేరకు రాష్ట్రపతి పేరున వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, మతపరమైన విద్వేషాలు రచ్చగొట్టే రీతిలో ప్రధాని చేసిన ప్రసంగం ముస్లిం సముదాయాన్ని తీవ్ర అవమానానికి గురి చేసేవేదిగా ఉందన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రాజకీయ ప్రసంగాల్లో మతపరమైన విద్వేషాలు లేదా ఏదైన ఒక మతాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ప్రదాని బహిరంగసభలో చేసిన వ్యాఖ్యలు అన్ని ప్రదాన మీడియాల్లో ప్రసారం జరిగినా ఎన్నికల కమిషన్ చర్యలకు ఉపక్రమించకపోవడం బాదాకరమన్నారు. రాష్ట్రపతి తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.